ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 24-03-2026 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు.
2. హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.
3. రాష్ట్రంలో ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.
4. రాష్ట్రంలో ఎక్కడ కూడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది.

---------------------------

**DG - AIR**

వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుందని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ MS మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు

ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెలకువలను పెంపొందిస్తుందని అన్నారు.

**S/B – DG – RAJIV KUMAR JAIN**

సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,PIB హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ ,ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**S/B – DG –RAJIV KUMAR JAIN**

**GS**

-------------------------------------

**ASSEMBLY - SRIDHARBABU**

హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి తరపున ఆయన సమాధానం ఇస్తూ.... దాదాపు 16 వేల కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సర కాలంలో నగరాభివృద్ధికి 2,250 కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.

**( DESK)**

---------------------------

**Assembly - komatireddy**

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో కసిరెడ్డి నారాయణ రెడ్డి,

దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం ఆమోదించిందన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నామని మంత్రి తెలిపారు.

**( Desk)**

--------------------------------

**Assembly – adluri laxman**

అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా 2023 నుండి ఇప్పటి వరకు సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ పథకం అమలు కోసం ఇప్పటి వరకు 607 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని తెలిపారు. పథకం ప్రాధాన్యతను గుర్తించి ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు సకాలంలో ఉపకారవేతనాలు చెల్లించాలని సభ్యులు కోరారు.

**(Desk)**

-------------------------------

**Assembly – revenue minister**

రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, గత ప్రభుత్వం ఈ సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ జీ.ఓ. నెంబర్ 76 ను విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.

**( desk)**

---------------------------

**CIVIL SUPPLIES**

రాష్ట్రంలో ఎక్కడ కూడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం పూర్తిగా, సక్రమంగా పనిచేస్తోందని వెల్లడించింది. అన్ని జిల్లాల్లోని ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. తప్పుడు వదంతుల వల్ల ప్రజలు భయపడి అకస్మాత్తుగా ఇంధనం కొనుగోలు చేయడానికి ఎగబడటం వల్లనే కొన్ని పెట్రోల్ బంకులలో పొడవైన క్యూలు, తాత్కాలికంగా "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తున్నాయని తెలిపింది. ఇంధన అవసరాల కోసం ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొంది.

**( GS)**

-------------------------------

**MANUU - REDIO**

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ గచ్చిబౌలి క్యాంపస్‌లో "రేడియో MANUU 90.0 FM" పేరుతో కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ప్రారంభించింది. ఈ స్టేషన్‌ను ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ...విద్యార్థులు, స్థానిక ప్రజలు కేవలం శ్రోతలుగా కాకుండా, కార్యక్రమాల తయారీలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమాచారం అందించడంలో రేడియో ఇప్పటికీ విశ్వసనీయ మాధ్యమంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

**(MSV)**

--------------------------

**pm samman nidhi – sircilla**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 22వ విడత నిధులు తన బ్యాంకు ఖాతాలో జమా అయ్యాయని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్య పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు తోట శేఖర్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్... తోట శేఖర్**

**(PTC - RS)**

--------------------------

## World Tuberculosis day – dist reports

ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. నిర్మల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, సంగారెడ్డి లో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఆసిఫాబాద్ లో జిల్లా వైద్యాధికారి సీతారాం, భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా వైద్యాధికారి తుకారం పాల్గొన్నారు. టీబీ రహిత తెలంగాణ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపు నిచ్చారు.

**(ptc,s)**

-----------------------

## Mulugu - anganwadi

అంగన్వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను పకడ్బందీగా అమలు చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. జిల్లాలోని గోవిందరావుపేట మండలంలోని నర్సరీని, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలబాలికల సంఖ్య పెరిగేలా చూడాలని, నాణ్యతతో కూడిన ఆహారం పిల్లలకు అందించాలని చెప్పారు.

**(PTC -MLG)**

-----------------------------

## Nirmal – collector

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాల పెంపుదలనే లక్ష్యంగా విద్యాబోధన సాగాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. సారంగాపూర్ మండలం చించోలి బి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా బడికి రావాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. ప్రతి ఒక్కరు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

**(PTC- NRML)**

---------------------------